చలాన కోసం చంపేశారు

వాహనాల తనిఖీల పేరుతో ట్రాఫిక్ పోలీసుల జులుం
విధులు గాలికి... జరిమానాలే లక్ష్యంగా తనిఖీలు
ఆన్‌లైన్ జరిమానాలు విధించే వెసులుబాటు విస్మరణ
భౌతికంగా పట్టుకునేందుకే ఉత్సాహం
న్యాయస్థానాల ఆదేశాలు బేఖాతరు
తాళం చెవిలు లాక్కోవడం... వాహనాలు సీజ్ చేయడం
బాలానగర్ ఘటనలో ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం
బస్సుకిందపడి ప్రాణాలు కోల్పోయిన వాహనదారుడు జోష్ బాబు

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): చలాన్ల కోసం ట్రాఫిక్ పోలీసులు అత్యుత్సాహంతో వాహనదారుల ప్రాణాలు పోవడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమవుతున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణను గాలికొదిలేసి....పగలు లేదు, రాత్రి లేదు....చలాన్ల వసూళ్లే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై యమకింకరుల్లా వ్యవహరిస్తున్నారు. స్పీడ్ లిమిట్ బోర్డులుండవు... సిగ్నల్ క్రాసింగ్ లైన్లు సక్కగా ఉండవు.....కొన్ని చోట్ల సిగ్నల్స్ సరిగ్గా పని చేయవు. డివైటర్లకు రేడియం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నగరంలో తలెత్తే ట్రాఫిక్ సమస్యనే మన ట్రాఫిక్ పోలీసుల పనితీరుకు నిలువెత్తు నిదర్శనం. కాని జరిమానాల వసూళ్లలో మాత్రం కోట్ల రూపాయలు వసూలు చేస్తూ నెంబర్‌వన్ స్థానంలో ఉంటారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని ట్రాఫిక్ సిగ్నల్స్, చౌరస్తాలు, ప్రమాదకరమైన మలుపులు, జంక్షన్‌లతో పాటు రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి, తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ఇన్నర్ రింగ్‌రోడ్డుపైకి మధ్యాహ్నం నుంచి భారీ వాహనాలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ప్రధాన ప్రాంతాలలో ఎక్కడికక్కడే ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతుంటాయి. ఈ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు అది తమ పని కాదన్నట్టుగా కేవలం చాలన్ల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారని వాహనాదారులు ఆరోపిస్తున్నారు. పెండింగ్ చలాన్‌ల వసూళ్ల కోసం చౌరస్తాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, నడిరోడ్లపై హఠాత్తుగా వాహనాలను ఆపేస్తూ ముక్కుపిండి చలానాలు చెల్లించాలని వేధిస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఒక పక్క ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కొని ఇబ్బందులు పడుతుంటే, మరో పక్క ట్రాఫిక్ వసూళ్లకు వాహనాలను ఆపుతూ ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారేందుకు ట్రాఫిక్ పోలీసులు కారణమవుతున్నారని వాహనదారులు మండిపడుతున్నారు.

భౌతిక జరిమానాలకే ఉత్సాహం...

ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించాలి. జరిమానాలు విధించేందుకు వాహదారులను భౌతికంగా పట్టుకోనవసరం లేదు. వారి వాహన నెంబర్ ఉంటే చాలు. అంతే కాకుండా ఉల్లంఘనులను గుర్తించేందుకు రోడ్లపై ప్రత్యేక సీసీ కెమెరాలు ఉన్నాయి. అదీ కాకుండా ట్రాఫిక్ పోలీసుల చేతిలోనూ కెమెరాలు, సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు కూడా ఉన్నాయి. వీటి ద్వారా ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులను గుర్తించి వారికి ఈ-చలానాలు విధించవచ్చు. మితి మీరిన ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చార్జీషీట్లు కూడా దాఖలు చేసే వెసులుబాటు కూడా ఉంది. చట్టపరంగా ఇన్ని వెసులుబాట్లు ఉన్నప్పటికీ చాలా మంది ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఒంటిపై యూనిఫామ్ ఉందికదా అని చట్ట విరుద్ధంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రై కమిషనరేట్ల పరిధిలోని చాలా మంది ట్రాఫిక్ పోలీసులు భౌతిక చలానాలు విధించేందుకే ఉత్సాహం చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం డ్రైవింగ్‌లో ఉన్న వాహనదారులను హఠాత్తుగా ఆపడం, ఆపిన వెంటనే వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనలను బలవంతంగా స్టేషన్‌లకు తరలించి సీజ్ చేయడం వంటి తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారు. ఈ చర్యలన్నీ పూర్తిగా చట్టవిరుద్ధమని పలు మార్లు న్యాయస్థానాలు హెచ్చరించినా పోలీసుల తీరులో మార్పు రావడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు.

చలాన్ల కోసం ప్రాణాలు తీస్తారా...

ఇదిలా ఉండగా మరికొంత మంది ట్రాఫిక్ పోలీసులు మరో అడుగు ముందుకేసి వాహదారులపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే గతంలో వనస్థలిపురం వద్ద వాహనాలు తనిఖీలు జరుపుతున్న ట్రాఫిక్ పోలీసులు తమను చూసి వేగంగా పారిపోతున్న ద్విచక్రవాహనదారుపై లాఠీ విసిరేయడంతో అది మరో వాహనంపై వెళ్తున్న ఒక వృద్ధుడికి తగిలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సదరు వృద్ధుడు కిందపడి దుర్మరణం చెందడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. 2010లో అబిడ్స్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు తమను చూసి పారిపోతున్న ఒక వాహనదారుడిని పట్టుకునే క్రమంలో అతడి వాహనాన్ని పట్టుకుని లాగడంతో సదరు వాహనదారుడు కిందపడి మృత్యువాత పడ్డాడు. మరో ఘటనలో ట్యాంక్‌బండ్‌పై 2011లో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని ఆపకుండా వెళ్తున్న వ్యక్తి వాహనాన్ని పట్టుకుని లాగడంతో సదరు వాహనదారుడు కిందపడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. 2013లో మరో ఘటనలో ఎల్బీనగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఒక ఎస్ఐ జరిమాన చెల్లించేందుకు నిరాకరించిన వాహనదారుడిపై హెల్మెట్‌తో తలపై దాడి చేయడం అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ తరహా ఘటనలతో పలు మార్లు న్యాయస్థానం వాహనాల తనిఖీలు, జరిమానాలు విధించడం, వసూళ్లు చేయడంపై చట్టపరిధిలో ఉన్న నియమాలు పాటించాలని హెచ్చరించినా పోలీసుల తీరులో మార్పు రావడం లేదు. ఈ క్రమంలోనే తాజాగా బాలానగర్ ఘటనలో జోష్ బాబు అనే వాహనదారుడి మరణానికి స్థానిక ట్రాఫిక్ పోలీసులు కారణమయ్యారని బాధిత కుటుంబ సభ్యులు, ఘటనా స్థలంలో ఉన్న వాహనదారులు ఆరోపిస్తున్నారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్...?

బాల్‌నగర్ ఘటనలో వాహనదారుడుల జోష్ బాబు మృతికి కారణమైన కానిస్టేబుల్ గోపాల్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బాలానగర్ పోలీసులు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి, వైద్యపరీక్షల నిమిత్తం గోపాల్‌ను దవాఖానకు తరలించినట్లు బాలానగర్ అదనపు డీసీపీ సత్యనారాయణ తెలిపారు.

నిండు ప్రాణం తీసిన కానిస్టేబుల్ అత్యుత్సాహం

బాలానగర్ ఐడీపీఎల్ కాలనీ గేటు వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు జీడిమెట్ల వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న జోష్‌బాబు వాహనాన్ని గోపాల్ అనే కానిస్టేబుల్ ఆపాడు. దీంతో వాహనాన్ని ఆపి, పక్కకు తీసుకున్న వాహనదారుడు తిరిగి వెళ్లేందుకు యత్నించాడు. దీంతో పక్కనే ఉన్న కానిస్టేబుల్ గోపాల్ జోష్ బాబును పట్టుకుని లాగడంతో అతను అదుపు తప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఆర్టీసి బస్సు జోష్‌బాబు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో అక్కడే ఉన్న వాహనదారులు, స్థానికులు పెద్ద ఎత్తున ఘటనా స్థలికి చేరుకుని పోలీసుల తీరుకు నిరసనగా ఆందోళనకు దిగారు. వాహదారుడి మృతికి కారణమైన కానిస్టేబుల్ గోపాల్‌కు దేహశుద్ధి చేసేందుకు యత్నించగా అప్పటికే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనకు దిగిన వాహనదారులు, స్థానికులపై లాఠీలు ఝుళిపించి వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు.

ఉద్యోగం పేరుతో రూ.2.57 లక్షలు టోకరా

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ఇంగ్లీష్‌లో ఉన్న నవలలు ఖాళీ పేపర్లలో చేతితో రాసి తమకు పంపించాలంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్లు ఒక మహిళను రూ. 2.57 లక్షలు ముంచారు. పోలీసుల కథనం ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన బాధితురాలి కూతురు స్కూల్‌లో చదువుతోంది. ఆమె తన స్నేహితులతో పార్ట్‌టైమ్ ఉద్యోగం విషయంలో 'ది ఫెడరేషన్ ఇండియా పబ్లికేషన్' అనే సంస్థ చేతి రాతతో రాసేందుకు నావెల్స్‌ను ఇస్తున్నారని చర్చించుకున్నారు. ఈ విషయం విన్న ఆమె తన స్నేహితురాలితో మాట్లాడుతుండగా నా వద్ద వాళ్ల ఫోన్ నంబర్ ఉందంటూ ఆమె ఇచ్చింది. బాధితురాలు ఆ నెంబర్‌కు వాట్సాప్‌లో మేసేజ్ పెట్టడంతో.. అవును మాది ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ జాబ్ అంటూ చెప్పుకున్నారు. మొదట మీరు రూ. 499 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే మీకు నావెల్స్, ఖాళీ పేపర్లు పంపిస్తామంటూ చెప్పారు. నిజమని నమ్మిన బాధితురాలు అందుకు ఒప్పుకుంది. ఈ క్రమంలోనే మీకు బుక్స్ డెలివరీకి పంపిస్తున్నామని, డెలివరీ చార్జీలు రూ. 1999 చెల్లించాలంటూ సూచించడంతో బాధితురాలు చెల్లించింది. తరువాత మీకు 70 శాతం అడ్వాన్స్ జీతం పంపిస్తున్నామని, బ్యాంకులో సాలరీ ఖాతా తెరిచేందుకు మీ వివరాలు ఇవ్వండంటూ నమ్మించారు.ఆ తరువాత జీఎస్‌టీ చెల్లించాలని డబ్బు వసూలు చేశారు. మీరు మొదట్లో చెల్లించే డబ్బంతా తిరిగి మీకు వాపస్ వస్తాయని, ఇదంతా మొదటి జీతంలో కలిపే వస్తాయంటూ నమ్మించారు. తిరిగి బ్యాంకు వెరిఫికేషన్, పెండింగ్, ఎన్‌ఓసీల ఫీజులంటూ దఫ దఫాలుగా ఆమె వద్ద నుంచి రూ. 2,57,192 సైబర్‌నేరగాళ్లు వసూలు చేశారు. ఇంకా డబ్బు అడుగుతుండటంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మిల్క్ డెలివరీ బాయ్‌పై దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 13: తెల్లవారుజామునే పాల్‌ప్యాకెట్లు వేస్తున్న యువకుడిపై దాడి చేయడంతో పాటు యాక్టివా బైక్ లాక్కుని వెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉంటున్న రేపాక సాయికృష్ణ పంజాగుట్ట నాగార్జున సర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ మిల్క్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్ నెం14లోని నందినగర్ ప్రాంతంలో పాల ప్యాకెట్లు వేసి క్యాన్సర్ రోడ్ నెం 10లోని గణేశ్ జువెలర్స్ వైపునకు తన యాక్టివా బైక్ మీద వెళ్తున్నాడు. గ్లామర్ బైక్ మీద వచ్చిన ముగ్గురు ఆగంతకులు కర్రతో సాయికృష్ణ మీద దాడి చేసి యాక్టివా బైక్‌ను లాక్కుని పారిపోయారు. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారికోసం గాలింపు చేపట్టారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి అంటూ బురిడీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 13:ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌కోసం పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ఫేస్‌బుక్‌లో వచ్చిన వీడియో చూసిన సినీ రచయిత సైబర్ మోసానికి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ సమీపంలోని ప్రగతి నగర్ లో నివాసం ఉంటున్న జనార్దన్ రెడ్డి సినీ రంగంలో రచయితగా పనిచేస్తుంటారు. రెండ్రోజుల క్రితం ఫేస్ బుక్‌లో ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ ద్వారా మంచి లాభాలు వస్తాయంటూ జీ పీ టీ ఆడిపెక్స్ అనే యాప్ గురించి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నట్లు వచ్చిన వీడియో ఆకర్షించింది. అమెరికా డాలర్లు పెట్టుబడి పెడితే రెండు వారాల్లో లాభాలు వస్తాయని మరో లింక్ లో చెప్పారు. దీంతో అతడు తన భార్య పేరుతో 430 డాలర్లు పెట్టుబడి పెట్టాడు. కొంతసేపు తర్వాత మరిన్ని డాలర్లు పెట్టుబడి పెట్టాలని రావడంతో అనుమానం వచ్చి వాకబు చేయగా నిర్మలా సీతారామన్ మాట్లాడిన వీడియో ఫేక్ అని తేలింది. ఇదంతా సైబర్ మోసగాళ్ల పని అని గుర్తించిన బాధితుడు జనార్దన్ రెడ్డి సైబర్ హెల్ప్ లైన్ లో ఫిర్యాదు చేశారు.దీంతో పాటు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రూ.39,694 మోసం జరిగిందంటూ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. కేసు నమోదు

బంజారాహిల్స్,ఏప్రిల్ 13 : మద్యం మత్తులో కారు నడుపుతూ ఆగి ఉన్న ఆటో ట్రాలీని ఢీకొట్టిన ఘటనలో యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 4లో నివాసముంటున్న ప్రభుత్వ సలహాదారు కేకే మనువడు వశిస్ట్ ధ్రువ్ ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితుడితో కలిసి తన ఐ 20 కారులో కేబీఆర్ పార్క్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్తుండగా ముందు గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ట్రాలీ ఆటో చెక్ పోస్ట్ వద్ద ఒక్కసారిగా ఆపేశాడు. దీంతో వెనుకనే ఉన్న కారు అదుపుతప్పి ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జు నుజ్జుకాగా ఆటో ట్రాలీ వెనక భాగం ధ్వంసం అయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని కారు నడిపిన వశిస్ట్ ధ్రువ్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 150 బీ ఏ సీ పాయింట్లు వచ్చింది. నిందితుడు వశిస్ట్ మీద పోలీసులు సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కారును సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అక్రమ బదిలీలను వెనక్కి తీసుకోండి

ఖైరతాబాద్, ఏప్రిల్ 13 : టీజీ జెన్‌కో చేపట్టిన అక్రమ బదిలీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్-1535 సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఎ వజీర్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కేటీపీఎస్ పాల్వంచ, కేటీపీపీ భూపాలపల్లి, చెల్లూర్, బీటీసీఎస్ భద్రాదిల నుంచి వంద మంది, రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ కేంద్రం నుంచి200 మంది ఓఅండ్‌ఎం కార్మికులను బలవంతంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా బదిలీ ఉత్తర్వులు జారీ చేయడం విచారకరమన్నారు. ఓఅండ్‌ఎం కార్మికుల విధులే ఎంతో కష్టతరమైందని, బదిలీలకు సంబంధించిన విధి విధానాలు లేకుండా వారిని బదిలీ చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలకు వెనుకాడమన్నారు.

రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది

సిటీబ్యూరో, ఏప్రిల్13,(నమస్తే తెలంగాణ): హైడ్రా, మూసీ ప్రక్షాళన రాకతో రియల్‌ఎస్టేట్ రంగం కుదేలైందని, కస్టమర్లు లేక ప్లాట్లు అమ్ముడుపోవటం లేదని సైబరాబాద్ బిల్డర్స్ అసోషియేషన్ సభ్యులు మంత్రి ఉత్తమ్‌కుమార్ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆ అసోషియేషన్ వార్షిక వేడుకలు ఆదివారం ఓ ప్రైవేట్ హోటలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ధరలు పెరిగాయని తమ సమస్యలు సీఎం దృష్టికి తీసుకుపోవాలని బిల్డర్స్ మంత్రిని కోరారు. వీటన్నింటిపై తనకు రాతపూర్వకంగా ఇవ్వాలని మంత్రి బదులిచ్చారు.

శివారుల్లో అక్రమ మద్యం దుకాణాలు

- నిబంధనలు పట్టించుకోని దుకాణదారులు
- మాబాస్ అధికార పార్టీవాడే అంటూ దబాయింపు
- మూముళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అనుమతులు లేకుండా శివారులలో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. శనివారం హనుమాన్ జయంతి వేడుకల నేపథ్యంలో ఉద యం 6 గంటల నుంచి మరుసటి రోజు 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలం టూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అన్ని చోట్ల మద్యం దుకాణాలు మూసేశారు. కాగా శివారులలో కొన్ని చోట్ల ప్రైవేట్ అడ్డాలలో మద్యం ఏరులై పా రింది. బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు కూ త వేటు దూరంలో ఉన్న ఒక భవనంలో మద్యం విక్రయాలు జరగడమే కాకుండా, అక్కడే సిట్టింగ్ చేస్తూ మం దుబాబుల జాలీగా గడిపేశారు. శివారుల్లో బెల్ట్ షాప్‌లు చాలా వరకు కొనసాగుతున్నాయి. బెల్ట్‌షాపులంటే గ్రామీ ణ ప్రాంతాలు, బస్తీలలో దుకాణాలలో కొంత మేర మద్యం సీసాలు తెచ్చి విక్రయిస్తుంటారు. ఆయా పరిధిలోని మద్యం దుకాణాల నుంచి ఈ బెల్ట్‌షాపు నిర్వాహకులు మద్యం కొనుగోలు చేస్తుంటారు. ఆయా ప్రాంతాలలో ఖాళీ భవనాలను తీసుకొని అం దులో అనధికారికంగా మద్యం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇదంతా ఎక్సైజ్, పోలీసులకు తెలిసే జరుగుతున్నాయంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నెల వారీగా మా ముళ్లు తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నారని స్థానికు లు ఆరోపిస్తున్నారు. అక్రమ వ్యాపారాలు సాగుతు న్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ 365 రోజులు 24 గంటలు మద్యం దొరుకుతుందంటూ స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అయితే తమ ఉన్నతాధికారులకు తెలిస్తే తమకు సమస్యలొస్తాయం టూ స్థానిక అధికారులు దుకాణదారులతో మాట్లాడితే.. సార్ మా బాస్‌లు చూసుకుంటారు.. మాబాస్ అధికార పార్టీకి చెందిన వాడే. ఆయ నుండగా మీ వద్దకు ఎవరు రారు.. మీరు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకండి.. మీకు ఏమీ కావాలో చెప్పండి అది పంపిస్తామంటూ ఎక్కడికక్కడే అక్రమ వ్యా పారులు అధికారులను డబ్బుతో కట్టడి చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి పెడితే అక్రమ దందాలు బయటకు వస్తాయంటూ ప్రజలు చెబుతున్నారు.

అలరించిన సంపూర్ణ శతావధానం

పద్యాలను పూరిస్తున్న డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ తదితర సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 13: అశేష సాహితీ ప్రియులు, కవి పండితులు, అవధానుల సమక్షంలో నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో సంపూర్ణ శతావధానం కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ప్రముఖ శతావధాని డాక్టర్ ఆముదాల మురళి సంచాలకత్వ భాధ్యతలో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన అవధానంలో పృచ్ఛకులు సంధించిన సమస్యలను, నిషిద్దాక్షరి, దత్తపది అంశాలకు తనదైన విద్వత్‌తో శతావధాన పూర్ణచంద్ర డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ పూరించి పద్యాలలోని మాధుర్యాన్ని ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు, కార్యక్రమ అధ్యక్షుడు నారుమంచి అనంతకృష్ణశర్మ, కార్యదర్శి డాక్టర్ మారుమాముల దత్తాత్రేయశర్మ, సభా సంచాలకులు అవుసుల భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజ-పద్యం, అవధాన వికాస పరిషత్ సంయుక్తాధ్వర్యంలో జరుగుతున్న సంపూర్ణ శతావధానం కార్యక్రమం సోమవారంతో ముగుస్తుందని నిర్వహణ కోశాధికారి కె.వి.ఎన్. ఆచార్య తెలిపారు.

లిఫ్ట్ గుంతలో ఇరుక్కుని ఆర్ఎంపీ మృతి

అక్బర్ పాటిల్ (ఫైల్)

దుండిగల్, ఏప్రిల్ 13: ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో ఇరుక్కుని ఓ ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం సర్కిల్, సూరారం పరిధి, సూరారంలోని కార్తికేయ వెంచర్ లోని శ్రీ సాయి మణికంఠ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అక్బర్ పాటిల్(38) గాంధీనగర్ లో ప్రైవేట్ క్లినిక్ ఏర్పాటు చేసుకొని ఆర్ఎంపీ డాక్టర్ గా సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో తన ఇంటి వద్ద కొందరు చిన్నారులు క్రికెట్ ఆడుతుండగా బాల్ అపార్ట్‌మెంట్ లిఫ్టు గుంతలో పడింది. తీసేందుకు అక్బర్ పాటిల్ గుంతలోకి తలదూర్చి బాల్ కోసం చూస్తుండగా పైనుంచి అకస్మాత్తుగా వచ్చిన లిఫ్టు అక్బర్ పాటిల్ తలపై పడింది. అక్బర్ పాటిల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అధిక రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. అపార్ట్ మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే లిఫ్ట్ గుంత సరిగా మూయకపోవడం వల్ల ఈ ఘటన జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్ బయోటెక్నాలజీదే

ఓయూ అధ్యాపకుడు డాక్టర్ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ఓయూ, జేఎన్టీయూ, కాకతీయ, శాతవాహన, మహాత్మా గాంధీ వంటి యూనివర్సిటీలలో బీటెక్ బయోటెక్నాలజీ రెగ్యులర్ కోర్సును 2025-26 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని ఓయూ అధ్యాపకుడు డాక్టర్ అడ్డగట్ల రవీందర్ డిమాండ్ చేశారు. కోవిడ్ లాంటి ఎన్నో మహమ్మారిలను నియంత్రించే వ్యాక్సిన్‌ను కనుగొన్నది బయోటెక్నాలజీ నిపుణులేనని గుర్తు చేశారు. బీటెక్‌లో బయోటెక్నాలజీ కోర్సు ప్రవేశపెట్టినట్లయితే ఎంసెట్ మెరిట్ ద్వారా ప్రభుత్వ కళాశాలల్లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులకు సువర్ణ అవకాశం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. కొవిడ్ పరిణామాలతో ప్రపంచ వ్యాప్తంగా బయోటెక్నాలజీ రంగానికి ప్రాధాన్యం పెరిగిందని, ఈ రంగంలో నిపుణుల కొరతను అధిగమించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని చెప్పారు.

బైపీసీ విద్యార్థులకూ అవకాశం కల్పించాలి..

ఎంపీసీ విద్యార్థులు ఐఐటీ, జేఈఈ పరీక్ష ద్వారా ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రవేశం పొందవచ్చని వివరించారు. అయితే బైపీసీ విద్యార్థులు ఆకోర్సులో చేరెందుకు అవకాశం లేదని.. దాంతో వారు పక్క రాష్ట్రాలకు వెళ్లి లక్షల ఖర్చుతో బీటెక్ చదువుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బైపీసీ విద్యార్థులకు సైతం బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్రంలో ఇప్పటికే ప్రైవేట్ యూనివర్సిటీలలో బైపీసీ విద్యార్థులకు బీటెక్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

డాక్టర్ అడ్డగట్ల రవీందర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-330722

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-329239

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916, స్పాట్ క్యాష్. NT-330718

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 9949520296. NT-336465

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: కాశీ యాత్ర: 2 జూన్, 10 క్షే, Ac స్లీపర్ బస్ రూ. 20,000/-; రామేశ్వరం యాత్ర: 16 జూన్, 20 క్షే, 13 రో, Ac స్లీపర్ బస్ రూ. 18,500/- @ 9676637578. NT-329241

PLOT FOR SALE

★చౌటుప్పలికి దగ్గరలో విజయవాడ హైవేకి ఆనుకుని ఉన్న DTCP అప్రూవ్డ్ వెంచర్‌లో గజం కే. 9 వేలు మాత్రమే. రోడ్